క్లుప్తంగా

చిన్నారి వైద్యానికి సాయం అందజేత

మలికిపురం: క్యాన్సర్‌తో బాధపడుతున్న 4 ఏళ్ల చిన్నారి సానబోయిన ధన్వితకు గల్ఫ్ మిత్రమండలి సేవా సమితి సభ్యులు, సేవా సమితి ఆధ్వర్యాన సేకరించిన విరాళాల మొత్తం రూ.యాభై వేల రూపాయలను దన్విత తండ్రి సానబోయిన గంగాప్రసాద్‌కు అందించారు. రావులపాలేనికి చెందిన ప్రసాద్ కుటుంబం విజయవాడలో స్థిరపడ్డారు. విజయవాడలో ఉంటున్న సంస్థ సభ్యులు స్పందించి ఈ మేరకు సాయం సమకూర్చారు. బుధవారం విజయవాడలో గల్ఫ్ మిత్ర మండలి సేవాసమితి సభ్యులు కట్టా పూర్ణ సత్యనారాయణమూర్తి, అప్పారి సత్యనారాయణ, జోగి పూర్ణచంద్ర, గుడాల సత్య ప్రసాద్‌లు కలసి అందజేశారు.

కిడ్నీ బాధితురాలికి ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందిస్తున్న సంస్థల సభ్యులు

మలికిపురం: మండలంలోని చింతలమోరి గ్రామానికి చెందిన నల్లి ఊర్మిళ రెండు కిడ్నీలు పాడవడంతో బాధపడుతోంది. దీంతో ఆమెకు పలువురు ఆర్థిక సాయం చేశారు. గాడ్స్ గాస్పల్ ఫౌండేషన్ ఫౌండర్ జిల్లెళ్ల ఉదయ్ కిరణ్ సభ్యుల ద్వారా కలెక్ట్ చేసిన రూ.16 వేలు, అలాగే జిల్లెళ్ల బాబూప్రసాద్ ద్వారా కువైట్ నుంచి జీసస్ హోప్ చారిటీ ఫౌండేషన్ సమకూర్చిన రూ. 15 వేలలను కలిపి మొత్తం రూ.31 వేలను ఆమెకు అందించారు. చింతలమోరి గ్రామ ఎంపీటీసీ తోటి రాజేష్, తాడి సహదేవ్, జీసస్ హోప్ చారిటీ సభ్యులు రాజబాబు మాస్టర్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో నల్లి గోపి, సూరిబాబు, చెవ్వాకుల థామస్ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



సభలో మాట్లాడుతున్న డీఎస్పీ మురళీమోహన్, పాల్గొన్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మలికిపురం: ప్రతి ఒక్కరూ మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వర ప్రసాద్, డీఎస్పీ మురళీమోహన్ సూచించారు. మండలంలోని లక్కవరంలో జరిగిన సదస్సులో ఇరువురూ పాల్గొని ప్రసంగించారు. గంజాయి నిర్మూలన, శక్తి యాప్‌లపై సభలో పాల్గొని మహిళలు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆడ పిల్లలను, మహిళలను గౌరవించేలా పిల్లలను పెంచాలని సూచించారు. అక్రమాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. సీఐ నగేష్‌కుమార్, ఎస్సై సురేష్, గుబ్బల శ్రీనివాస్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వీఓఏ హత్యపై నిరసన

మలికిపురం: అల్లూరి సీతారామరాజు జిల్లా అరకువేలి మండలం, గన్నెల పంచాయతీలో డప్పుగూడ గ్రామైక్య సంఘంలో వీవోఏగా పనిచేస్తున్న గడబంటు భీమన్నను విధి నిర్వహణలో ఉండగా అత్యంత దారుణంగా దుండగులు హత్య చేయడం దారుణమైన సంఘటన అని రాజోలు తాలూకా వీఓఏల సంఘం ఆందోళన వ్యక్తం చేసింది. మలికిపురం మండలం లక్కవరంలో రాజోలు క్లస్టర్ వీఓఎల సమాఖ్య (మలికిపురం, రాజోలు, సఖినేటిపల్లి, మామిడికుదురు, గన్నవరం) యూనియన్ సమావేశమై ఈ మేరకు ఖండించింది. సమావేశంలో ఏపీ వెలుగు వీవోఏల యూనియన్ రాజోలు క్లస్టర్ యూనియన్ అధ్యక్షులు మట్ట మంగాదేవి, సెక్రటరీ టీకేడీఎంఎల్ దేవి, కోశాధికారి చెల్లింగి అన్నపూర్ణ, అనంతలక్ష్మి, రాజ్యలక్ష్మి సుశీల, నక్కా సువర్ణకుమారి, సూరిబాబు, విజయ, సుబ్బలక్ష్మి, ప్రభావతి, సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



చింతలూరులో విద్యార్థులకు బహుమతులు అందజేసిన ఎంఈఓ అప్పాజీ

ఆలమూరు: మండలంలోని చింతలూరులోని మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ప్రధానోపాధ్యాయుడు ఉడతా వెంకటేశ్వరరావు, సహచర ఉపాధ్యాయుడు వాసా నాగ వీర దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు ఎంఈఓ భమిడిపాటి అప్పాజీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వివిధ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పతకాలు, ధ్రువపత్రాలను అందజేశారు. విద్యార్థుల్లో స్ఫూర్తిని కలిగించేలా ఏటా స్నాతకోత్సవం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులను ఆయన అభినందించారు.

అల్పపీడనంతో అన్నదాత ఆందోళన

- కలవరపెడుతున్న అకాల వర్షాలు
- దాళ్వా చివరి సమయంలో పాట్లు

మామిడికుదురు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం రైతులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. దీని ప్రభావంతో కురుస్తున్న వర్షాలు రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఎప్పుడు వర్షం వస్తుందో.. ఎప్పుడు ఎండ కాస్తుందో తెలియని అయోమయ పరిస్థితుల్లో రైతులు తల్లడిల్లుతున్నారు. మామిడికుదురు మండలంలో 2800 ఎకరాల విస్తీర్ణంలో దాళ్వా పండించారు. ప్రస్తుతం పంట కోత దశకు వచ్చింది. మామిడికుదురులో సుమారు 50 ఎకరాల్లో కోత కోసిన పంట పనలపై ఉంది. సుమారు 100 ఎకరాల్లో పంటను మెషీన్ ద్వారా కోత కోసి మాసూళ్లు పూర్తి చేశారు. ఈ తరుణంలో కురుస్తున్న అకాల వర్షంతో రైతులు తీవ్రం ఆందోళన చెందుతున్నారు. పనలపై ఉన్న పంట తడిసి ముద్దవడంతో నష్టాలు వస్తాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రతికూల వాతావరణంతో భయం

వారం రోజుల నుంచి వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. వాతావరణం ప్రతికూలంగా మారింది. ఒక వైపు ఎండ కాస్తూనే, మరో వైపు వర్షం కురుస్తోంది. ఈదురు గాలులు, పిడుగులు, భారీగా వర్షం కురవడంతో రైతులు ఆందోళనతో ఉన్నారు. కోత కోసిన తర్వాత ధాన్యం తడిస్తే మొలక వచ్చే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. ఎంతో కష్టపడి పంట పండించామని, తీరా దిగుబడి చేతికి అందే సమయంలో ప్రతికూల వాతావరణ తమ పాలిట శాపంగా మారిందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ పది రోజులు గడిస్తే చాలు అన్న పరిస్థితి ఏర్పడింది. రైతులు భారం వరుణ దేవుడిపైనే వేసి ముందుకు వెళ్తున్నారు.



మామిడికుదురులో పనలపై ఉన్న పంట

కోత కోసి మూడు రోజులైంది



అయిదెకరాల్లో పంట కోత కోసి మూడు రోజులైంది. గత రెండు రోజుల నుంచి కురుస్తున్న అకాల వర్షానికి పంట తడిసి పోయింది. దీని వల్ల ధాన్యం రాలిపోయి మొలక వచ్చే ప్రమాదం ఉంది. రెండు రోజులు ఆరితేనే ధాన్యం మాసూళ్లు చేసే అవకాశం ఉంటుంది. వాతావరణం ఏ క్షణంలో ఎలా ఉంటుందో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది.

– పినిశెట్టి నాగబాబు, రైతు, మామిడికుదురు

వరుణ దేవుడు కరుణించాలి



రెండెకరాల్లో పంట కోత కోశాం. కోత కోసి రెండు రోజులైంది. కోత కోసిన రోజు నుంచి వర్షమే. ధాన్యం తడవకుండా బరకాలతో కప్పాం. మెషీన్ ద్వారా కోత కోసిన పంటను ఒడ్డుకు చేర్చేందుకు నానా కష్టాలు పడ్డాం. వర్షం వల్ల ట్రాక్టర్ వచ్చే పరిస్థితి లేదు. అంతా వరుణ దేవుడి కరుణపైనే మా పరిస్థితి ఆధారపడి ఉంది.

– కడలి సత్యనారాయణమూర్తి, రైతు, మామిడికుదురు

ఉపాధి పనుల నిలిపి వేయాలి



వ్యవసాయ పనుల సీజన్‌లో ఉపాధి పనులు నిర్వహించడం వల్ల కూలీల కొరత ఏర్పడుతోంది. కూలీలు దొరక్క ఎక్కువ కూలీ ఇచ్చి పనులు చేయించుకోవాల్సిన పరిస్థితి వస్తోంది. వ్యవసాయ పనులు ముమ్మరంగా ఉన్న రోజుల్లో ఉపాధి పనులు నిలిపి వేయాలి. దీని వల్ల కూలీల సమస్య లేకుండా ఉంటుంది. ఈ దిశగా అధికారులు దృష్టి సారించాల్సి ఉంది.

– బీరా గణేశ్వరరావు, రైతు, మామిడికుదురు

ప్రజా ప్రతినిధులను గౌరవించండి

- అధికారుల తీరుపై వైఎస్సార్ సీపీ నిరసన
- మండల సమావేశాలను బహిష్కరించిన నేతలు



ఆలమూరులో మండల సమావేశాన్ని బహిష్కరించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు



రావులపాలెంలో బడ్జెట్ సమావేశాన్ని బహిష్కరించి ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న ఎంపీపీ, ఇతర వైఎస్సార్ సీపీ నేతలు

ఆలమూరు: ప్రజలచే ఎన్నికైన ప్రజాప్రతినిధులను గౌరవించి ప్రజాస్వామ్యాన్ని కాపాడి రాజ్యాంగాన్ని గౌరవించాలని మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మండల సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు అధ్యక్షతన బుధవారం జరిగిన మండల సమావేశంలో కూటమి నేతల ప్రోద్బలంతో అధికారులు అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని ప్రశ్నిస్తూ చెముడులంక, గుమ్మిలేరు, ఆలమూరు సర్పంచ్‌లు తమ్మన శ్రీనివాసు, గుణ్ణం రాంబాబు, నేలపూడి లావణ్య నేతృత్వంలో సర్పంచ్‌లు మండల సమావేశాన్ని బహిష్కరించారు. ఎంపీపీ లక్ష్మణరావు, జడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మితో పాటు ఎంపీటీసీలందరూ వైఎస్సార్ సీపీ సర్పంచ్‌లకు మద్దతు పలికారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఈ మేరకు ప్రజాస్వామ్యాన్ని కాపాడండి–ప్రజా ప్రతినిధులను గౌరవించండంటూ నినాదాలు చేశారు. ఎంపీపీకి తెలియకుండా ఎంపీడీఓ ఏ రాజు వ్యవస్థను నడపడం అధికార దుర్వినియోగానికి పరాకాష్ట అని పేర్కొన్నారు.

సమాచారం లేదు

భారత రాజ్యాంగంలో 73, 74 సవరణ ద్వారా కల్పించిన హక్కులను అధికారుల సహకారంతో కూటమి నేతలు హరిస్తూ ప్రజాస్వామ్యాన్ని పరిహసిస్తున్నారని వైఎస్సార్ సీపీ ప్రజా ప్రతినిధులు తీవ్రంగా విమర్శించారు. ఇటీవల జరిగిన ఈబీసీ, కార్పొరేషన్, గోకులం షెడ్ల మంజూరులో అనర్హులు, అనుయాయులకు లబ్ధి చేకూర్చారని ఆరోపించారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల సమాచారం ఇవ్వకుండా అధికారులు పక్షపాతం చూపుతున్నారన్నారు. అన్నిస్థాయిల్లో అధికారులు కూటమి నేతల కనుసన్నల్లో పనిచేస్తున్నారని, ప్రజా ప్రతినిధులకు సముచిత స్థానం కల్పించడం లేదన్నారు. గ్రామాల్లో వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలకు మంజూరు చేసిన నిధులను వారికి తెలియకుండా పక్కదారి పట్టించి దుర్వినియోగానికి పాల్పడ్డారని దుయ్యబట్టారు. అధికారులు, కూటమి నేతల ఆగడాలపై జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి ఆదేశాల మేరకు నిరంతరం పోరాటం చేసి ప్రజలకు అండగా ఉంటామని వారు పేర్కొన్నారు.

సంక్షేమ కార్యక్రమాల్లో ప్రొటోకాల్ పాటించాలి

రావులపాలెం: కూటమి పాలనలో అధికారులు ప్రజా సంక్షేమ కార్యక్రమాల్లో స్థానిక నాయకులను పక్కన పెడుతూ ప్రొటోకాల్ పాటించకుండా వ్యవహరిస్తున్నారని, అర్హులు కాకపోయిన కూటమి నాయకులు ఎంపిక చేసిన వ్యక్తులను బీసీ, ఈబీసీ, కాపు సబ్సిడీ రుణాలకు ఎంపిక చేయడంపై అధికారులను ఎంపీపీ కర్రి లక్ష్మీవెంకటనాగదేవి, జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు ప్రశ్నించారు. దీంతో బుధవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో జరగాల్సిన బడ్జెట్ సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలు, సర్పంచులు బహిష్కరించారు. తొలుత ఎంపీడీవో మహేశ్వరరావు, తహసీల్దార్ బీఎం ముక్తేశ్వరరావులు మండల పరిషత్ బడ్జెట్ సమావేశాన్ని నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. అయితే మండల స్థాయి అధికారులు హాజరైన వైఎస్సార్ సీపీకి చెందిన ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచులు హాజరు కాకపోవడంతో సమావేశాన్ని కొద్దిసేపు అధికారులు ఆపి వేచి చూశారు. ఇంతలో ఎంపీపీ కేఎల్వీ నాగదేవి ఆధ్వర్యంలో జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ బొక్కా ప్రసాద్, సర్పంచులు కర్రి గోవిందకృష్ణారెడ్డి, సబ్బితి మోహనరావు, తదితర ఎంపీటీసీలు, సర్పంచులు సమావేశ మందిరానికి వచ్చారు. అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదంటూ ఎంపీటీసీలు, సర్పంచులు తమ వద్దకు వచ్చారని ఎంపీపీ నాగదేవి ఎంపీడీవోకు వివరించారు. అలాగే బడ్జెట్ సమావేశానికి సంబంధించి అజెండా కాపీలను ముందుగా ఎంపీపీకి, ఇతర సభ్యులకు ఇవ్వకుండా అధికారులే సిద్ధం చేసి సమావేశం నిర్వహించేందుకు ప్రయత్నించడం సరైన విధానం కాదని అన్నారు. గౌరవ ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వాలని ఎంపీపీ నాగదేవి ఎంపీడీవో, తహసీల్దార్లకు సూచించారు. దీంతో తాము బడ్జెట్ సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్టు ప్రకటించారు. అయితే కూటమి పార్టీకి చెందిన కేవలం ముగ్గురు ఎంపీటీసీలు మాత్రమే బడ్జెట్ సమావేశానికి హాజరు కావడంతో మీటింగ్ నిర్వహించేందుకు కావలసిన కోరం లేకపోవడంతో అధికారులు బడ్జెట్ సమావేశాన్ని వాయిదా వేస్తున్నామని మరోసారి ప్రజాప్రతినిధులందరికీ సక్రమంగా సమాచారం అందించి నిర్వహిస్తామని ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలు మల్లిడి లావణ్య, శివ, గూటం తిమోతి ప్రకాష్ రావు, సర్పంచులు దొమ్మేటి అర్జున్ రావు, సబ్బితి మోహనరావు, అంబటి సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ మండపం ప్రారంభం



ఆలమూరులో కన్వెన్షన్ హాలు ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఆలమూరు: గ్రామంలో రూ.కోట్లతో నిర్మించిన విఘ్నేశ్వర(ఎస్‌వీ) కన్వెన్షన్ హాలును కొత్తపేట మాజీ ఎమ్మెల్యే, జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి బుధవారం ప్రారంభించారు. అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించిన స్థానిక మెయిన్ రోడ్డు పక్కన ఈ కల్యాణ మండపాన్ని నిర్మించిన వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు రావాడ సత్తిబాబును ఆయన అభినందించారు. అనంతరం స్థానిక పార్టీ నాయకులతో సమావేశమైన మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని సభ్యులు బహిష్కరించడంపై సమాచారం అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ తోట పృథ్వీరాజ్, అముడా మాజీ చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, సర్పంచులు నేలపూడి లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక దశలో గుర్తిస్తే కుష్ఠు నివారణ సాధ్యం



వానపల్లి పీహెచ్‌సీలో మాట్లాడుతున్న ఏడీఎంహెచ్‌ఓ భరతలక్ష్మి

కొత్తపేట: కుష్ఠు వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తిస్తే అంగవైకల్యం రాకుండా నివారించవచ్చని అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ భరతలక్ష్మి తెలిపారు. డీఎంఅండ్ హెచ్‌ఓ దుర్గారావుదొర సూచనల మేరకు మండలంలోని వానపల్లి పీహెచ్‌సీలో భరతలక్ష్మి ఆధ్వర్యంలో కొత్తపేట డివిజన్లోని వైద్యాధికారులకు, నోడల్ పర్సన్లకు కుష్ఠు వ్యాధిపై ఒక్కరోజు శిక్షణ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కుష్ఠు వ్యాధి ఎలా వస్తుంది.. ఎలా రాదు అనే అంశాలపై జిల్లా డిప్యూటీ ఆఫీసర్ మాధవరపు వెంకటేశ్వర్లు వివరించారు. వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వాలు వైద్య ఆరోగ్య శాఖ ద్వారా అందిస్తున్న సేవా కార్యక్రమాలను డివిజనల్ నోడల్ ఆఫీసర్ చిక్కాల సూర్యారావు వివరించారు. వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నమోదైన కేసు వివరాలను కొత్తపేట డివిజన్ నోడల్ ఆఫీసర్ రాజు వివరించారు. కార్యక్రమంలో డివిజన్‌లోని పీహెచ్‌సీల వైద్యాధికారులు, నోడల్ పర్సన్లు పాల్గొన్నారు.

చిన్నారులకు టీకాలు



ఆలమూరులో చిన్నారులకు టీకాలు అందజేస్తున్న ఆరోగ్య సిబ్బంది

ఆలమూరు: చిన్నారులకు నిర్ణీత సమయంలో విధిగా టీకాలు వేయించాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.మల్లికార్జున్ అన్నారు. ఆయా పీహెచ్‌సీల పరిధిలోని సబ్ సెంటర్లతో పాటు ఆలమూరు ప్రభుత్వ ఆస్పత్రిలో హెల్త్ సిబ్బంది బుధవారం చిన్నారులకు టీకాలు అందజేశారు. వైద్యాధికారుల ఆధ్వర్యంలో ఎంపీహెచ్‌ఈఓ కె.జ్యోతికుమార్, సీహెచ్‌ఓ పి.రాధాకృష్ణ, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలామణి వైద్యసేవలను పర్యవేక్షించారు. పెదపళ్ల, చింతలూరు, పెనికేరు, చొప్పెల్ల, చెముడులంక, మడికి, గుమ్మిలేరు, నర్శిపూడి గ్రామాల్లో చిన్నారులకు టీకాలు, బాలింతలకు, గర్భిణులకు ఇంజక్షన్లు అందజేశారు. ధనుర్వాతం, కామెర్లు, క్షయ, పోలియో, డిఫ్తీరియా, కోరింత దగ్గు నివారణకు టీటీ, డీపీటీ, మీజిల్స్, పెంటావాలెంట్, ఎంఆర్, హైపటైటిస్ బీ వ్యాక్సిన్లను అందజేశారు. బాలింతలకు, గర్భిణులకు బలవర్థక ఔషధాలను, యాంటీ బయాటిక్ మందులను అందజేశారు. హెల్త్, అంగన్‌వాడీ, ఆశ సిబ్బంది పాల్గొన్నారు.

పోషణ్ పక్వాడాతో సంపూర్ణ ఆరోగ్యం



ఆలమూరులో భారీ ర్యాలీలో పాల్గొన్న శాంతకుమారి తదితరులు



పడమటిపాలెంలో చిన్నారులకు అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

ఆలమూరు: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అమలు చేస్తున్న పోషణ్ పక్వాడాను సద్వినియోగం చేసుకోవాలని సంపూర్ణమైన ఆరోగ్యాన్ని పొందాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐసీడీఎస్ పీఓ బి.శాంత కుమారి అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో కొత్తపేట సీడీపీఓ అధికారి గజలక్ష్మి, ఎంపీడీఓ రాజు, సూపర్‌వైజర్లు టీఎస్‌వీ నాగలక్ష్మి, వై.అరుంధతి ఆధ్వర్యంలోని మండల స్థాయిలో ఏర్పాటు చేసిన పోషణ్ పక్వాడా ర్యాలీని బుధవారం ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం తీసుకోవడంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. గర్భస్థ శిశువు నుంచి బిడ్డ పుట్టిన మూడేళ్ల కాలవ్యవధి వరకూ గర్భిణి, శిశువు ఆరోగ్యంగా ఉండడానికి తగిన పౌష్టికాహారం, వైద్యపరీక్షలు, ఐరన్, కాల్షియం, అయోడిన్ సాల్ట్, విటమిన్లు, ఆకుకూరలు, కాయగూరలు, పాలు, గుడ్లను తప్పనిసరిగా తీసుకోవాలన్నారు, అలాగే ఏడబ్ల్యూసీలో ఇస్తున్న ఐదు రకాల బాలసంజీవని కిట్లు తీసుకోవాలన్నారు. రోజూ తినే ఆహారంలో చిరుధాన్యాలు ఉండే విధంగా ప్రత్యేకశ్రద్ధ వహించాలన్నారు. అప్పుడే పుట్టిన బిడ్డకు ముర్రుపాలను అందించి శిశువు సంపూర్ణ ఆరోగ్య రక్షణకు శ్రద్ధ తీసుకోవాలని మహిళలకు ఆమె విజ్ఞప్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా ఈనెల ఎనిమిదిన ప్రారంభమైన పక్షోత్సవాలను 22న ముగియనున్నాయన్నారు. అనంతరం పౌష్టికాహార వారోత్సవాల ఆవశ్యకతను వివరిస్తూ అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది భారీ ర్యాలీ నిర్వహించారు. ఎంఈఓ భమిడిపాటి అప్పాజీ తదితరులు పాల్గొన్నారు.

సఖినేటిపల్లిలో..

సఖినేటిపల్లి: రాజోలు ఐసీడీఎస్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం మోరి, సఖినేటిపల్లి, రామేశ్వరం సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలలో పోషణ్ పక్వాడా పేరుతో పోషకాహార ఆవశ్యకతపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. ఈ మేరకు గొంది అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన సదస్సులో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్‌కె.మీరా మున్నీసా, పోషకాహారం తీసుకోవడంపై గర్భిణులకు, బాలింతలకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్‌లు పాల్గొన్నారు.

పౌష్టికాహార పక్షోత్సవాలు

మలికిపురం: మండలంలోని పడమటిపాలెం, లక్కవరం అంగన్వాడీ కేంద్రాల్లో బుధవారం పోషకాహార పక్షోత్సవాలు నిర్వహించారు. పోషకాహార లోపం ఉన్న పిల్లలను గుర్తించి తగిన ఆహారం ఇవ్వడంపై అవగాహన కల్పించారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచ్‌లు ఆకుల మాధవీ నాగలక్ష్మి, కోట పుష్పకుమారి సూపర్‌వైజర్ ప్రసన్న రాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు మేరీ, మణి తదతరులు గర్భిణులు, బాలింతలు, కిశోరి బాలికలకి పోషణపై అవగాహన కల్పించారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ

సఖినేటిపల్లి: ఏపీ ప్రభుత్వ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అంతర్వేదిపాలెంలో ఏపీ కమ్యూనిటీ మేనేజ్ ప్రకృతి వ్యవసాయం (ఏపీసీఎన్‌ఎఫ్) కాన్సెప్ట్ కింద 30 రకాల విత్తనాలతో సాగు, నేలతల్లి బాగు(పీఎండీఎస్) పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక అంగన్‌వాడీ భవనం వద్ద మాజీ సర్పంచ్ నల్లి సురేంద్ర అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు, నవధాన్యాల సాగుపై చర్చా గోష్టి నిర్వహించారు. వార్డు మెంబర్లు, ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జ్ వై.జూలీ, వీపీఏలు, వీఓఏలు, రైతులు పాల్గొన్నారు.

అంబాజీపేట మార్కెట్ కమిటీ చైర్మన్‌గా శ్రీనివాస్

అంబాజీపేట: అంబాజీపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా అయినవిల్లి మండలం అయినవిల్లి లంకకు చెందిన చిట్టూరి శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం మార్కెట్ కమిటీ చైర్మన్‌ల నియామకాలను బుధవారం ప్రకటించింది. ఈ నియామకాల్లో అంబాజీపేట మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైనట్లు శ్రీనివాస్ తెలిపారు.

ఆదర్శప్రాయుడు కందుకూరి



ఆలమూరులో నాటక పోటీ విజేతలకు బహుమతులు అందజేసిన బాల మందిరం వ్యవస్థాపకులు

ఆలమూరు: ప్రముఖ సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు జీవితాన్ని అదరూ ఆదర్శంగా తీసుకోవాలని బాలమందిరం వ్యవస్థాపక అధ్యక్షుడు అంగర గోపాలాచార్యులు (కృష్ణశ్రీ) అన్నారు. కందుకూరి వీరేశలింగం జయంతి, తెలుగు రంగస్థలం దినోత్సవం సందర్భంగా బాల మందిరం ఆధ్వర్యంలో ఆలమూరు శాఖ గ్రంథాలయంలో బుధవారం నాటక పోటీలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీడీఓ రాజు, ఎంఈఓ భమిడిపాటి అప్పాజీ, గ్రంథాలయాధికారి తమ్మా నమశ్శివాయ పాల్గొని పోటీలను తిలకించారు. ఈ పోటీల్లో సంధిపూడిలోని ఎంపీపీఎస్ పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన నాటిక అందరినీ అలరించింది. అనంతరం నాటక పోటీల్లో చక్కని ప్రతిభను కనబర్చిన విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

కొత్తపేటలో..

కొత్తపేట: సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు స్త్రీ విద్యకు, మహిళల అభ్యుదయానికి ఎంతో కృషి చేశారని విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు అన్నారు. ప్రముఖ కవి, సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు జయంతిని స్థానిక డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ రాజు అధ్యక్షతన తెలుగు విభాగం లెక్చరర్ కె.సుకృదవల్లి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా వీరేశలింగం చిత్రపటానికి పూలమాలను వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ కేపీ రాజు మాట్లాడుతూ ఆనాడు సమాజంలో ఉన్న మూఢనమ్మకాలకు, సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం కలిగించే విధంగా రచనలు చేశారన్నారు. ఆయన సంపాదకత్వంలో వివేకవర్ధిని, సతీహిత బోధిని అనే పత్రికలను నడిపారని వాటి ద్వారా సమాజంలో చైతన్యం తీసుకువచ్చారని వివరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

కూటమి వైఫల్యాలను వివరించండి



రాజ్యసభ సభ్యుడు బోసును సత్కరిస్తున్న ఆదిత్య, సతీష్

మామిడికుదురు: ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించి వైఎస్సార్ సీపీని బలోపేతం చేసే దిశగా కృషి చేయాలని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ సూచించారు. మామిడికుదురుకు చెందిన పార్టీ సీనియర్ నేత కటకంశెట్టి ఆదిత్య, ఉప్పలగుప్తం మండలం విలసవిల్లి గ్రామశాఖ అధ్యక్షుడు సలాది సతీష్ బుధవారం రామచంద్రపురంలో వైఎస్సార్ సీపీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా నియమితులైన బోసును మర్యాద పూర్వకంగా కలిశారు. అతడ్ని శాలువాతో ఘనంగా సత్కరించారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. బోసు మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీల పేరిట కూటమి ప్రజల్ని వంచనకు గురి చేసిందన్నారు. దీనిపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు.

సంకష్టహర చతుర్థి పూజలు



విఘ్నేశ్వరుని సన్నిధిలో లక్ష్మీగణపతి హోమంలో పూజలు చేస్తున్న భక్తులు

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామివారి సన్నిదిలో సంకష్టహర చతుర్థి సందర్భంగా బుధవారం విశేష పూజలు చేశారు. స్వామికి విశేష పూజలు అభిషేకాలు, పూజలు జరిపారు. నిర్వహించారు. స్వామి ఉత్సవ విగ్రహాన్ని ఆలయ ప్రాగణంలో ఊరేగించారు. స్వామివారి లక్ష్మీగణపతి హోమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామిని అధిక సంఖ్యలో దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి

ఆలమూరు: బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలంటూ మండల విద్యాశాఖ బుధవారం స్పెషల్ అడ్మిషన్ డ్రైవ్ నిర్వహించింది. ఆలమూరులోని కండ్రికపేట ఎంపీపీ పాఠశాల పరిధిలో నిర్వహించిన ఈ డ్రైవ్‌లో ప్రధానోపాధ్యాయుడు అద్దరి శ్రీనివాసరావు నేతృత్వంలో ఉపాధ్యాయ సిబ్బంది ఇటుక బట్టీలు, కార్మికుల నివాసాలకు వెళ్లి ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి చదువుకునే విద్యార్థులందరినీ బడిలో చేర్పించారు. సీఆర్‌టీ ఎ.వెంకట జ్యోతి, ఉపాధ్యాయుడు పిల్లి రాంబాబు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.